# కీలు బొమ్మలు

ఆఫీసులో అడుగు పెట్టగానే "అయ్యగారు రమ్మంటున్నారండీ" అన్నాడు సిద్ధడు.

ఇంకా తొమ్మిది గంటలు కూడా కాలేదు. అప్పుడే అయ్యగారు ఆఫీసుకు రావడమూ, రాగానే నాకోసం ఖబురు పంపించడమూ కొంచెం ఆశ్చర్యంగానే ఉన్నది.

మళ్ళీ యేదో విపరీతం రానే వచ్చిందనుకొంటూనే నెమ్మదిగా ప్రొప్రయిటరు గదిలోకి వెళ్ళాను సాధారణంగా మనం ఒకరికోసం ఖబురు పెట్టినప్పుడు వాళ్ళు ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తూంటాం. మా ప్రొప్రయిటరుకు అటువంటి అలవాటేమీ లేదు. కనుక నేను వెళ్ళి అయిదునిమిషాలసేపు నుంచున్నా నేను వచ్చినట్లు తనకు తెలియనట్లు ఆ ఫైలూ, ఈ ఫైలూ తిరగవేశాడు కొంచెం కోపం వస్తే మాత్రం చేసేదేముంది? కష్టం కలిగితే మాత్రం తప్పేదేమిటి?

'ఏలూరునుంచి ఎప్పుడొచ్చారు?' అన్నాడు కూచోమనకుండగానే కొంచెం సేపయాక.

"పొద్దున మెయిలుకు వచ్చాను." అన్నాను.

"కూచోండి. ఏలూరు బ్రాంచి సంగతి ఏమీ బాగాలేదు."

"అవును బాగాలేదు. వాళ్లుమాత్రం ఏం చేస్తారూ? జిల్లాబోర్డు ప్రెసిడెంటుకు మన పొడగిట్టటంలేదు."

"ఏం? ఎందుకని? మనం ఆయన నేమి చేశాం?"

"ఏమో తెలియదు."

"లెక్కలన్నీ సరిగ్గా ఆడిట్ చేశారా? మూర్తి యేమన్నాడు? ఈయేడు టరన్ ఓవర్ పెరక్కపోతే సంక్రాంతికి బోనసులు ఉండవని చెప్పారా? ఇంక్రిమెంట్లు ఆపాల్సొస్తుందని చెప్పారా? అవన్నీ నేను వ్రాశాననుకోండి అయినా ఇన్స్పెక్షనుకు వెళ్లినప్పుడు మీరుకూడా కొంచెం అదిలిస్తూ ఉండాలి సరే ... రేపటినుంచీ అకౌంట్సు సెక్షన్‌కూడా మీరే చూడండి. 'ఇవాళ సుబ్బారావుగారిదగ్గర ఛార్జి తీసుకోండి. టైపిస్టువచ్చినతరువాత ఆర్డర్లు పంపిస్తాను." అని నేను చెప్పేదానికోసం ఎదురుచూడకుండానే అనేశాడు

సుబ్బారావంటే ప్రొప్రయిటరుగారిమరదలు కొడుకు. వాడంటే ప్రొప్రయిటరుకు చాలా యిష్టమని వదంతి సుబ్బారావువల్లనే ఆనర్సుపరీక్షలవగానే నాకు ఈ ఉద్యోగం దొరికింది కనుక సుబ్బారావు భవిష్యత్తేమిటో తెలుసుకోకుండా ఛార్జి తీసుకుంటానని అనడానికి బాధ కలిగింది.

"మరి నాఛార్జి ఎవరికి ఇవ్వమంటారు" అన్నాను.

"ఇవాళ్ల ఇరవయ్యోతారీకుగదా? ఇన్స్పెక్షన్ రిపోర్టులన్నీ నాలుగైదు రోజులలో తయారుచేసి ఇవ్వండి. ఈలోగా ఆ సెక్షన్ కూడా మీరే చూడండి తరువాత వేరే యేర్పాటు నేను చేసుకుంటాను."అన్నాడు ప్రొప్రయిటరు. అని ఇక నువ్వు వెళ్ళవచ్చునన్నట్లు చూచాడు.

ప్రొప్రయిటరుగదిలోనుంచి నా టేబుల్ దగ్గరకు వెళ్లేటప్పటికి సుబ్బారావువచ్చాడు.


## వి. యస్. అవధాని

నేరుగావెళ్లి తన టేబుల్ దగ్గర కూచుని పని ప్రారంభించాడు. సుబ్బారావువంక చూచాను వాడు నిన్న వచ్చిన టరన్ ఓవర్ షీట్లు సరిచూస్తున్నాడు. అవన్నీ నేను సరి చూచి సంతకం చెయ్యాలి. తరువాత వాటిని టైప్ చేయించాలి. ఆ తరువాత వాటిమీద ప్రొప్రయిటరుసంతకం పెట్టాలి. ఆతరువాత వాటిని సుబ్బారావు టేబిల్ లోకి ఎక్కించాలి. ఇదంతా సింగిల్ ఎంట్రీ సిస్టమ్.............

సుబ్బారావుదగ్గరికి వెళ్ళి ఈ విషయం చెపుదామనుకొన్నాను. అప్పటికే గుమాస్తాలందరూ వచ్చారు. టైపు మెషన్లు టక టకా మోగుతున్నవి. ఆఫీసు అనే యంత్రం నెమ్మదిగా కదిలింది. పదకొండు గంటలకు టపా వస్తుంది. టపా వస్తే ఇంటిదగర ఎవరో చచ్చారని కబురు వచ్చినా ఆఫీసులో నుంచి కదిలే వీలుండదు. అంత వేగంగా సడీశబ్దం లేకుండా ఆఫీసు అనే యంత్రం పోతూంటుంది. కనుక కొంచెం కాఫీ తాగివద్దామని ఆఫీసుకు ఎదురుగా వున్న హోటలుకు వెళ్ళాను.

కాఫీ తాగుతున్నానే గాని మనసు అక్కడలేదు. ఆరేండ్లనుండి ఇన్స్పెక్షన్ సెక్షన్‌లో ఉన్నాను. రెండుసార్లు బొంబాయికూడా వెళ్ళి సరుకు ఓడలకు ఎక్కించి వచ్చాను ఎప్పుడూ పనివిషయంలో అశ్రద్ధచెయ్యలేదు. నేను కాక ఇంకా యేడుగురు ఇన్స్పెక్టర్లున్నారు. మొత్తం 32 బ్రాంచీలలో నా పాలిట ఆరు బ్రాంచీలున్నవి. ప్రతినెలలోనూ మొదటి మూడువారాలు ఈ బ్రాంచీల లెక్కలు తనిఖీ చెయ్యడంతోనే సరిపోతుంది. స్టాక్ ఎంత నిలవఉన్నది? రోజు వారీ అమ్మకం ఎంత? రొఖ్ఖపు బేరం ఎంత? అరువు బేరం ఎంత? ఇతర కంపెనీలకు నష్టయి ఎంత? ఇవన్నీ నేను తనిఖీ చెయ్యవలసిన విషయాలలో కొన్ని. నాకంటు భార్యాపిల్లలు లేరు. కాని ప్రతి బ్రాంచి మేనేజరుకూ లోకమిచ్చిన భార్య ఒకర్తె, కొందరు పిల్లలూ ఉంటారు. వాళ్ళజీతాలు చాలా తక్కువగా ఉంటవి. కనుక లెక్కలలో కనిపించేదానికీ, రొఖ్ఖం నిలవ బాంకిలో ఉన్నదానికీ కొంచెం తేడా వుంటుంది

మామూలుఖాతాలో గాక అనామతుఖాతా అని ఒకటి ప్రతిబ్రాంచిలోనూ ఉంటుంది. దాని అంతు కనుక్కొనటం నాకు కాదు గదా ఇండియా అకౌంటెంట్ జనరలుకు కూడా తెలుసునో లేదో వినుయినా నన్ను ఈ సెక్షన్‌నుంచి మార్చడానికి కారణం ఏమిటి? ఆలోచిస్తూ కూచున్నాను. కాఫీ



హిందూ దేశమంతటా దొరుకును

# ★ కీలు బొమ్మలు ★

చప్పగా చల్లారిపోయింది. మళ్ళీ కాఫీ తెమ్మన్నాను. సర్వర్ కాఫీ తెచ్చేలోగా సుబ్బారావు వచ్చాడు.

"రారా ఇట్లా కూచో" అన్నాను.

"విశేషాలేమిటి?" అన్నాడు వాడు కూర్చుంటూ.

"బాయ్ మరో కాఫీ" అన్నాను.

"ఏమిట్రా ... ఏమిటి సంగతులు. ఏం అంతదిగాలుగా ఉన్నావేం? ఇంటిదగ్గర ఎవరికన్నా జబ్బుగా ఉన్నదా? సెలవడిగితే ఇవ్వనన్నాడా మనబాస్" అన్నాడు సుబ్బారావు ఆప్యాయంగా.

అంతచనువుగా, ఆప్యాయంగా మాట్లాడు తున్నవాడికి ఈ విషయం ఎట్లా చెప్పను? ఏమని చెప్పను? చెప్పకపోయినా ఇంకా కొంచెం సేపటికి తెలుస్తుంది. నేను ప్రొప్రయిటరుగదిలో నుంచి రావడం సుబ్బారావు చూచాడు. నేను ఈ సంగతి ముందర చెప్పకపోతే ఆ తరువాత అది తెలిసినప్పుడు నేనే వాడిమీద ఏవో నేరాలు చెప్పి ఆ పోస్టులో నన్ను వెయ్యమని అడిగానని వాడు అనుకోవచ్చు...

"ఏమిట్రా దేభ్యం? అట్లా చూస్తావేం. ముందు కాఫీ తాగు" అన్నాడు సుబ్బారావు.

"సుబ్బారావ్...ఒక్క సంగతి. మీ సెక్షన్లో గుమాస్తాలు ఎంతమంది?" అన్నాను.

"ప్రస్తుతం అయిదుగురూ. ఏమిటీ సంగతి?"

"ఏం చెప్పమంటావ్? ఇవాళ పొద్దునే ఏలూరునుంచి వచ్చాను. గదికివెళ్ళి స్నానం చేసి కాఫీకూడా తాగకుండా ఆఫీసుకు పడివచ్చాను. ప్రొప్రయిటరు అప్పటికే నాకోసం కబురుపెట్టాడు."

"పెడితేయేం? ఏం కొంపమునిగింది? శ్రీవారి కటాక్షవీక్షణలో ఉన్నావు. అదృష్టవంతుడివి. ఆయనకి పెండ్లికావలసిన కూతురొకతె ఉన్నదిలే."

"వేళాకోళానికి ఇది సమయం కాదురా బాబూ? ఆయనకు నన్ను ఇంట్రడ్యూస్ చేసిందినువ్వు. నీవల్లనే నాకీ ఉద్యోగం వచ్చింది. నీకు నేను చాలా ఋణపడి ఉన్నాను. ఇప్పుడు నీ పోస్టులో నన్ను వేస్తానంటున్నాడు."

సుబ్బారావు బిగ్గరగా నవ్వాడు.

నాకేమీ అర్థం కాలేదు.

"ఎందుకు అట్లా నవ్వుతావ్"

"అవును నిజమే నవ్వాల్సింది కాదు. నీ అమాయకత్వంచూచి ఏడవాల్సింది" అన్నాడు సుబ్బారావు.

"అదేమిట్రా అట్లా అంటావూ? ఒక చెంప కొంప లంటుకొనిపోతుంటే. ఉద్యోగం ఊడితే గంపెడంత సంసారాన్ని ఎట్లా ఈదుస్తావు?" అన్నాను.

"నామీద జాలిపడమాక. నీ సంగతి నువ్వు చూచుకో. ఆరేండ్లుగా ఉద్యోగం ఏడుస్తున్నా ప్రొప్రయిటర్ సంగతి నీకేమీ అర్థంకాలేదు. పద...టపా వచ్చినట్లుంది." అన్నాడు సుబ్బారావు.

## 2

సుబ్బారావు చెప్పింది నిజమే అయింది. సుబ్బారావును మా కంపెనీనుంచి తీసివేశారు. కాని, వాడిపోస్టులో నన్ను వెయ్యలేదు. అంతవరదాకా వాడికి అసిస్టెంటుగాఉన్న శర్మను సుబ్బారావు పోస్టులో వేశారు. శర్మకు అదివరకు నూటముప్ఫయి ఇచ్చేవాళ్లు. ఇప్పుడు ఒక్కసారిగా రెండువందలకు పెరిగింది వాడి జీతం. ముష్టిజీతంసంగతి ఎవడికికావాలి గాని ప్రొప్రయిటరుసంగతే నాకు అంతు పట్టకుండా ఉన్నది.

పనిమాలా పిలిచి సుబ్బారావు ఛార్జి తీసుకోమని చెప్పమని నేను ప్రొప్రయిటరు మీదపడి ఏడ్చానా? అయినా సుబ్బారావు చేసిన తప్పేమిటి? ఈయేడుకింద కూడంత లాభంలేనిమాట నిజమే. అయితే దానికి సుబ్బారావు బాధ్యుడా? కాడే. అడ్వర్టైజ్మెంట్ సెక్షన్ వేరేఉన్నదాయె సేల్సు సెక్షన్ వేరేఉన్నదాయె. ఇవన్నీ కాక సేల్సు ఎట్లా ఎక్కువ చెయ్యాలో చెప్పడానికి సలహాదార్ల శాఖ ఉన్నదాయె. వాటన్నింటిని వదిలిపెట్టి అకౌంటెంట్ను ఎందుకు తీసివేసినట్లు? అందులోనూ సుబ్బారావు ప్రొప్రయిటరుకు పరాయివాడు కాడే. పైగా సుబ్బరావు అదివరకు మద్రాసులో ఏదో కంపెనీలో పనిచేస్తూవుంటే ప్రొప్రయిటరు వాణ్ణి బ్రతిమాలుకుని తెచ్చుకున్నాడే? వాణ్ణి ఎందుకు తీసివేసినట్లూ! గుడ్డిలో మెల్ల అన్నట్లు సుబ్బారావుకు మూడు నెలల జీతం, రెండు నెలల లీవు జీతం, ఒకనెల బోనసు ఇచ్చారు. అంతవరకు నయమేలే అనుకున్నాను. ఇంత డబ్బు ఎదురిచ్చి సుబ్బారావును ప్రొప్రయిటరు ఎందుకు వదులుకున్నాడు?

మరో రెండునెలలు గడిచినవి. సుబ్బారావు సీట్లో పనిచేస్తున్న శర్మవల్ల, ఆఫీసులో చాలా మార్పులు వచ్చిన వనుకుంటున్నారు. నామటుకు నేను నెలకు ఇరవై అయిదు రోజులు వూళ్ళమీద పడి తిరిగే వాణ్ణి కనుక ఆ మార్పులు నాదాకారాలే దేమో?

ఒకరోజు నేను కాకినాడ బ్రాంచిలో పని పూర్తి చేసుకొని వచ్చే సరికి నా సెక్షన్నుంచి ఇద్దరు గుమాస్తాలనూ ముగ్గురు ఇనస్పెక్టర్లనూ తీసివేసినట్లు ఒక సర్క్యులరు నా టేబిల్మీద ఉన్నది. సంతకం ప్రొప్రయిటరుది కాదు. ప్రొప్రయిటరు కలకత్తా వెళ్లాడు. వెళితే జనరల్ మేనేజరు సర్క్యులరు పంపించాలి. అంతే కాని శర్మ ఎవరూ ఆర్డరు పంపించడానికి?

---

సినిమాస్కోపు సినిమా నడుస్తోంది. ముందుసీటులో ఒకాయన హేట్ పెట్టుకొని కూర్చున్నాడు. వెనకవున్న సీటులోని పెద్దమనిషి ఆ హేట్ అడ్డం తప్పించుకు సినిమా చూడటానికి యింటర్వల్ దాకా నానా అవస్థలూ పడ్డాడు.

ఇంటర్వల్లో లైట్లు వెలిగాక ముందుసీటులో వున్న మనిషి భుజంతట్టి, "మీరా హేట్ ఎంతకు కొన్నారండీ" అని అడిగాడు.

"ఏం?"

"ఏమీ లేదు. చాలా బాగుంది."


"మూడున్నర యిచ్చి కొన్నాను."

"మరోలా అనుకోకపోతే యీ మూడున్నరా తీసుకొని, నాకా హేట్ యిచ్చెయ్యండి." అని పర్సుతీసి డబ్బు లెక్కపెట్టి ఆయన చేతులోపెట్టి, హేట్ తీసుకొని తన వొళ్లో పెట్టుకు కూర్చున్నాడు. లైట్లు ఆరిపోయి, మళ్లీ ఆట హాయిగా మొదలైంది.

మళ్ళీ ఒకసారి ఆ సర్క్యులరు అటునుంచి ఇటూ ఇటునుంచి అటూ చదివాను. ఆర్. వి. ఎస్. శర్మ ఫర్ ప్రొప్రయిటరు అని ఉన్నది. అప్పుడు అర్థమయిందను కొన్నాను శర్మ అనే ఈ కొత్త అకౌంటెంట్ ప్రొప్రయిటరుకు చాలాదగ్గరవా డయినాడనీ, అతనికి కష్టం కలిగించితే ఇక ఉద్యోగంకూడా ఖాళీ అవుతుందనీ... అయితే వచ్చిన చిక్కేమిటంటే ఏడు గురం ఇన్స్పెక్టర్లం ఉన్నప్పుడే ముప్ఫయి రెండు బ్రాంచీల పనీ చూచే టప్పటికి తలప్రాణం తోకకు వస్తున్నదే. ఇప్పుడు ఈ పనంతా అయిదుగురు ఇన్స్పెక్టర్లవల్ల అవుతుందా? ఏ బ్రాంచి లెక్కల వన్నా సేల్సుగాకున్న డిపార్టుమెంటులో, ఇన్కంటాక్సు డిపార్టుమెంటులో పట్టుకొంటే ఇన్స్పెక్టర్లే ఆ ఆఫీసులో హాజరు కావాలి. కాకపోతే బ్రాంచి మేనేజరు వెంటఉంటాడు. కావలసిన వివరాలు చెప్తాడు. వాళ్ళది అదో రకం తరహా!

మా సెక్షన్ అటెండరును తీసివేశారు. ఇదివరకు ఇద్దరూ బాయ్స్ ఉండేవాళ్ళు. ఒకణ్ణి తీసివేశారు. ఇదంతా యేమిటని ఆలోచిస్తూ కూర్చున్నాను. అంతలో శర్మ వచ్చాడు. రావడ రావడం హుటాహుటీగా నా దగ్గరికే వచ్చాడు.

"చూడూ గిరీ...మీ సెక్షన్లో..."




డీలర్లు: దొంత గోవిందయ్య సూర్యనారాయణయ్య హిందుపూరు; ఎన్. అబ్దుల్ అజీజ్ & సన్సు ఆదోని; మారెళ్ల వెంకటరామయ్య సక్, కడప; ఆర్. వెంకటరాయ గుప్త, కడప; వనమా అప్పన్న & సన్సు, ఐరన్ కంపెనీ, గుంటూరు; ఆలపాటి సత్యనారాయణ కనమర్లపూడి, రాములు ఐరన్ కంపెనీ, గుంటూరు; తంత వెంకటస్వామి శ్రేష్ఠి సన్, ఒంగోలు; పొలిమెర్ల శేషయ్య చెట్టి సన్సు, కర్నూలు; చిత్తలూరు పెద్ద వెంకటసుబ్బయ్య, నంద్యాల; ఎం. పెంచలయ్య చెట్టి, నెల్లూరు; పి. సుబ్బరామ చెట్టి, నెల్లూరు; బి. ఎమ్. సన్యాసి చెట్టి, మెయిన్ రోడ్డు, విజయనగరం.

# ★ కీలుబొమ్మలు ★

"అవును. చాలామందిని తీసివేశారు. ఇప్పుడే సర్క్యులరు చూచాను."

"ఏంచేద్దాం చెప్పు మరి. రోజులు అట్లా ఉన్నయ్. మనమందరం కష్టపడి పనిచేసి కంపెనీ పేరు నిలబెట్టాలి"

"అవును. కష్టపడి పనిచెయ్యాల్సిందే. ఇప్పుడెవరు కష్టపడి పనిచెయ్యడంలేదో చెబితే."

"అబ్బెబ్బే...చెయ్యడం లేదని కాదు. అటెండెరు లేడనుకో. ఏంచేస్తాం? మన ఇంట్లోఅయితే మనమే విస్తైలు ఎక్కడున్నదో చూచి తెచ్చుకుంటామా లేదా? కాఫీ కావాలనుకో? భార్య ఇంట్లో లేదనుకో ఏంచేస్తాం. మనమే కాచుకుంటామా లేదా? అట్లాగే ఆఫీసు పనికూడా మనమే సర్దుకుపోవాలి" అన్నాడు శర్మ. అని గబగబా తన సీట్ లోకి వెళ్ళిపోయినాడు. వెళ్లగానే ఒక కుర్రవాడు ఫాన్ వేశాడు. మరొకడు చేతిలోనుంచి బాగ్ తీసుకొని టేబుల్ మీద పెట్టాడు. అదంతా చూస్తున్న నేను నిర్ఘాంతపోయినాను.

శర్మ చెప్పింది నిజమే. రోజులు బాగా లేవు. డబ్బుకు చాలా ఇబ్బందిగా ఉన్నది. కనుక పొదుపు అవసరమే.

నాకంటే సంసారం గింసారం లేదు కనుక ఇబ్బంది అంటే యేమిటో స్వయంగా తెలియటంలేదు కాని ఆఫీసులో అరవై డెబ్బయి సంపాదించేవాళ్లు పెద్దపెద్ద సంసారాలతో ఎంత ఇబ్బంది పడుతున్నదీ వింటున్నాను. టైపిస్టులలో ఒకళ్లు మూడునెలల కిందట పాతికరూపాయలు తీసుకున్నారు. తిరిగి ఇవ్వలేదు. అసిస్టెంట్ కేషియర్ రామయ్య కిందటి నెలలో యాభైరూపాయలు తీసుకున్నాడు. వాడి సంసారాన్ని చూచినతరువాత డబ్బు ఇవ్వమని అడగ బుద్ధి పుట్టలేదు. మా మాలు సంసారాల సంగతే ఇలాఉన్నప్పుడు పెద్దపెద్ద కంపెనీల ఇబ్బందులు ఇంకా ఎక్కువగాఉండవా? అందులోనూ ఒకటికాదు రెండు - కాదు. ముప్ఫయిరెండు బ్రాంచీలనూ సర్దుకురావాలి. ఈయేడు మా కంపెనీ కొత్తగా రెండు వ్యాపారాలుకూడా ప్రారంభించింది. అంటే స్వయంగా ప్రారంభించలేదు. ఏవో రెండుకంపెనీలు దివాలా తీసేస్థితిలో వుంటే వాటిని మా ప్రొప్రయిటరు కొన్నాడు.

నాకు పట్టుకున్న బాధ యేమిటంటే ఇంతమందిని ఉద్యోగంలోనుంచి తీసి వెయ్యకపోతే ఆకొత్తవాటిలో మా కంపెనీలో పని తక్కువగాఉన్నవాళ్లను నియమించరాదా అని. అదల్లా ఉండగా మా కంపెనీలో వాళ్లకు పనితక్కువగాఉన్నదా అంటే అదీ కనిపించదు. జనరల్ మేనేజరు కాక అయిదుగురు సెక్షన్ మేనేజర్లున్నారు. ముగ్గురు కాషియర్లున్నారు. నలభై అయిదుగురు గుమాస్తాలున్నారు. వాళ్లలో ఏ ఒక్కడూ రాత్రి ఎనిమిదిగంటలవరకూ ఇంటిముఖం చూడడు. రాత్రి పొద్దుపోయేదాకా పనితో సతమతమవుతునే ఉంటారు. పైగా కొందరు తాలూకాఫీసుగుసూస్తా లాగా ఈ ఖాతా పుస్తకాలనూ, ఫైళ్ళనూ ఇంటికి తీసుకువెళతారు. పని తక్కువలేదు. ఉన్నవాళ్లందరికీ పూర్తిగా పని ఉన్నది. మరి ఈవిధంగా క్రమంగా ఉద్యోగులను ఎందుకు తీసివేస్తున్నట్లు? డబ్బు లేదా? ఇదివరకంతటి లాభాలు లేకపోవచ్చు. ఇదివరకు సంవత్సరానికి నాలుగు లక్షల లాభంవస్తే ఇప్పుడు రెండు లక్షలు వస్తున్నది. అంతేగాని అసలు లాభమే రాకపోవడం లేదు. మరి వాళ్ళందరినీ ఎందుకు తీసివేసినట్లు?

## 3

మరో ఆరునెలలు గడిచినవి. ఆ వేళ గుంటూరు బ్రాంచి ఇన్‌స్పెక్షన్‌కు వెళదామని స్టేషనుకువెళ్ళి టికెట్ కోసమని బుకింగ్ కిటికీవద్ద నుంచున్నాను. "హల్లో గిరీ" అంటూ ఎవరో వెనకనించి భుజంమీద చెయ్యవేశారు. వెనక్కు తిరిగి చూచి సూట్‌బూటూలో వున్న సుబ్బారావును మొదట గుర్తుపట్టలేకపోయాను.

"ఏరా...ఎట్లాఉన్నావ్" అన్నాడు సుబ్బారావు.

"ఏదో నీ దయవల్ల బాగానే ఉన్నా. ఎందాకా? ఇప్పుడెక్క ఉంటున్నావు?" అన్నాను.

"ముందు గుంటూరుకు రెండు ఇంటర్ తీసుకో. తరువాత రైల్లో మాట్లాడుకుందాం" అన్నాడు సుబ్బారావు."

టికెట్లు తీసుకున్నాను. ఇద్దరమూపోయి ఇంటరుక్లాసులో కూచున్నాము. రైలు కదులుతోంది.

"ఏరా బ్రదర్ అసలు సంగతి చెప్పు. ఇప్పుడు ఏ కంపెనీలో ఉంటున్నావ్? రోజూ కల్సుకుందామని అనుకుంటా. కాని, ఏంచెయ్యనూ చెప్పు. ఒకటే గొడవగా ఉంది."


సుబ్బారావు నవ్వాడు. మళ్లీ అదే నవ్వు. వెనకటినవ్వు. ఉద్యోగం పోతుందని చెప్పినప్పుడు ఎట్లా నవ్వాడో ఇవాళకూడా అట్లాగే నవ్వాడు. ఏమీ తెలియక వాడి ముఖంలోకి చూచాను.

"అయితే ప్రొప్రయిటరు కలకత్తానుంచి వచ్చాడా? కలకత్తాలో తాతావాళ్ళ బ్రాంచి లీస్‌కు తీసుకుంటాడుటగా"

"ఏమో తెలియదే? మరి నువ్వు ఏ కంపెనీలో ఉంటున్నావ్?"

చెప్పాడు. ఆశ్చర్యపోయాను. అది మా ప్రొప్రయిటరు ఇటీవల కొన్న కంపెనీలలో ఒకటి!!!

ఇదంతా ఏమిటన్నాను. సుబ్బారావు చెపుతున్నాడు:



"గిరీ...ఇది లోకం. ఈ లోకం సంగతి నీకు బొత్తిగా తెలియదు. ఇది ప్రపంచం కాదు. మాలోకం. ఆ రెండు కంపెనీలనూ కొనడానికే నన్ను మన కంపెనీలో నుంచి తీసివేశారు. అవి దివాలా తియ్యడానికి మన కంపెనీయే కారణం. దానికి చాలా గ్రంథం ఉన్నదిలే. అయితే ఈ యేడు చాలా లాస్ వచ్చిందటగా."

"ఎవరు చెప్పారు?" అన్నాను. "మా హెడ్ అకౌంటెంట్ శర్మ." అన్నాడు.

"ఆయన ఇంకా నిన్ను కలుస్తున్నాడా?"

"కలవక ఏడుస్తాడా యేం? ఆయన అంటావేమిటి? వాడు స్కూల్ ఫైనల్ కూడా సరిగ్గా పాస్ కాలేదు."

"పాస్ కాకపోతే యేం? ఇప్పుడు మా కంపెనీకి శర్మ సూపర్ మేనేజర్. ఆమాట అతని హోదా చెప్పడానికి చాలదేమో?"

"ఏం? అంత దూరం వచ్చిందా?"

"ఇన్ని తెలుసుకొన్న వాడివి అదికూడా తెలుసుకోలేదా మరి."

"ఏంచేశాడూ?"

"ఏం చెయ్యటయేమిటి? మొత్తం కంపెనీమీద ఓవంద మందిని ఉద్యోగాలలో నుంచి తీసివేశాడు."

"వాడు తీసివెయ్యడం ఏమిటి?"

"మరి ఏమనుకొంటున్నావ్" అని కాగితాలు చూపించాను.

సుబ్బారావు నవ్వాడు. నవ్వి సగం కాలిన సిగరెట్ కిటికీలోనుంచి పారేసి నెమ్మదిగా ఇలా అన్నాడు.

"లెక్కల ఆనర్సులో ఫస్టుక్లాస్ వచ్చిన నువ్వు ఇంతడన్నవనుకోలేదు. నీకు వ్యాపార మర్మం తెలియలేదు.' వ్యాపార మర్మమంటే మాలోక మర్మ మన్నమాట. శర్మ చూడు. ఎంత తెలివిగా నడుస్తున్నాడో."

"ఏమిటా తెలివి" అన్నాను.

"ఏమిటా? ప్రొప్రయిటరు ఆరునెలలు ఊళ్లో లేకపోయేటప్పటికి ఆఫీసునంతా మార్చివేశాడు. రిట్రెంచిచేసి ఖర్చు తగ్గించాడు. మేనేజర్లనందర్నీ హడలగొట్టాడు. అవకాశం వచ్చినా అటువంటి పని నువ్వు చెయ్యలేవు."

"అవును. చెయ్యలేను. ఇటువంటిపని చెయ్యలేను. లాస్ వచ్చింది. వచ్చింది అని గోలపెట్టేవాడేకాని నష్టం ఎందుకు వస్తున్నదో కనుక్కొన్న నాథుడు లేడు. నష్టం వచ్చిందనే నెపంతో ఉద్యోగులను తీసివెయ్యటం తెలివిగల పనేనా?"

"నష్టం ఎందుకు వస్తున్నదంటావ్?"

"నీకు తెలియకనే అడుగుతున్నానా?"

"అయినా చెప్పుదూ చూద్దాం."

"మన బ్రాంచీ మేనేజరలో దాదాపు అందరూ ఇండ్లు కట్టుకొన్నారు తెలుసా?" అన్నాను వళ్ళుమండి.

"ఏం కట్టుకుంటే" అన్నాడు సుబ్బారావు తాపీగా.

"ఏ బ్రాంచిలో వచ్చిన డబ్బు ఆ బ్రాంచి మేనేజరు వాడుకుంటే ఇక కంపెనీకి లాభం ఏం వస్తుందీ?"

"లాభం అంటే యేమిటి?" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

"అదీ నువ్వేచెప్పు" అన్నాను.

"మన బ్రాంచీల మేనేజర్లందరూ మన ప్రొప్రయిటరుకు కావలసినవాళ్ళు. వాళ్ళు ఇండ్లు వాకిళ్ళు కట్టుకొన్నా లాభం రావాలని మన ప్రొప్రయిటరు అభిప్రాయం."

"మరి ఎందుకు రావడంలేదు?"

"ఏం రాకపోతే?"

"మరి రాలేదని ఉన్నవాళ్ళని తీసి వెయ్యడం దేనికి"?

"ఏం తీసివేస్తే?" "వాళ్ళందర్నీ పోషిస్తానని ప్రొప్రయిటరు హామీ ఇచ్చాడా?" అన్నాడు సుబ్బారావు!

ఈ సుబ్బారావు ఉద్యోగం పోతుందని నేను బాధపడ్డానట!!

సంభాషణ అక్కడ ఆగిపోయింది. నేను సుబ్బారావునుగురించి ఆలోచిస్తున్నాను. సుబ్బారావు సిగరెట్ వెంట సిగరెట్ తగలేస్తున్నాడు. నేను నాలుగైదుసార్లు పొడుం పీల్చాను.........

## 4

ఇంకో నాలుగునెలలు గడిచినవి. బెజవాడ బ్రాంచిపని పూర్తిచేసుకుని ఆవేళనే ఆఫీసులోకి దిగాను. గుమాస్తాలందరూ హడావుడిగా ఉన్నారు. ఏమిటని అడిగితే శర్మను డిస్మిస్ చేశారన్నారు. శర్మకు బదులువాడి కింద పనిచేస్తున్న రంగయ్యను ఆపని చూడమన్నారు. జీతంమాత్రం పెంచలేదు. పెంచమని వాడు అడగలేదు. వాళ్లు పెంచుతామనలేదు. మనంమాత్రం మామూలుగానే బండిని లాక్కొస్తున్నాం! ★




గొల్లభామ పాలు

గడ్డ కట్టించిన తీపిపాలు

మీరు మొదట కోరతగినది

ఈ పాలనుగురించిన వివరములుగల కరపత్రము, ఇంగ్లీషు, అరవము, తెలుగు లేక మళయాళములో కోరినవారికి పంపగలము.